# యేసు యొక్క శోధనలు

## మత్తయి 4:1-11, పరిశీలన

క్రీస్తు తన బహిరంగ పరిచర్య ఆరంభించుటకు ముందు, పరీక్షించుటకుగాను తన శత్రువులతో సంఘర్షణకు తలపడ్డాడు.[1] చెడు యావత్శక్తితోను తీవ్రంగానూ బయటపడింది. అంతకు పూర్వం అంత ఉద్రిక్తతో దండెత్త లేదు సరిగదా, తరువాత కూడా అంత ఎత్తున ఎన్నడూ రాదు. ఈ పాఠం యేసు శోధనలను తెలుపుతుంది.[2]

నేపథ్యంలో మూడు విషయాలను యిక్కడ ప్రధానంగా చూపాలి. మనం ఈ క్రిందివాటిని ఆలోచన చేద్దాం ...

(1) **స్థలము.** ఆ దృశ్యము అరణ్యములో, రణరంగముగా మానవ జాతినుండి అది దూరంగా ఉండేలా ఏర్పరచుకొన్న చోటు.[3] ఇక్కడ పైపైనున్న అలంకార ఆభరణాలన్నీ ఎత్తి వేయబడి, శోధనయొక్క సారం మిగిలిపోయింది. పాపం చేయడం వలన ఆదాము తోటను అరణ్యంగా మార్చివేశాడు, కాని పాపాన్ని ప్రతిఘటించడం వలన యేసు అరణ్యాన్ని ఉద్యానవనంగా మార్చాడని చెప్పపడింది.

(2) **వ్యతిరేక వర్గాలు:** మొదటిగా, ప్రభువైన యేసు, అప్పుడే బాప్తిస్మం పొంది, దేవునిచే తన కుమారుడనే సాక్ష్యం పొంది వచ్చాడు. ఆయన నీళ్లలోనుండి ఒడ్డునకు వచ్చి, తన పరిచర్యను ప్రారంభింపనున్నాడు. రెండవదిగా, అపవాదియు వచ్చాడు. అక్కడ, అరణ్యపు అనుభవంలో ప్రభువైన యేసు, అంధకారసంబంధమైన అధిపతి, ఈ యుగ సంబంధమైన దేవతకు ఎదురుకు ఎదురుగా వచ్చి నిలిచాడు (2 కొరింథీ. 4:4; ఎఫెసీ. 2:2; 6:12).

(3) **ప్రాధాన్యత:** ఆ ఎదుర్కోలు తటాలున జరిగిన సంభవం కాదు – అది కేవలం "సంభవించలేదు." మత్తయి 4:1 యిలా అంటుంది: "అప్పుడు యేసు అపవాదిచేత శోధింపబడుటకు ఆత్మవలన అరణ్యమునకు కొనిపోబడెను." దీనికి దైవికమైన ఏర్పాటు గావించబడింది. బహిరంగపు పోటికి అపవాది వచ్చాడనే వాస్తవానికి దీనికన్న తేటగా కనుపరచేది లేకపోవచ్చు. ఈ విధంగా పోరాడడం అపవాదికి యిష్టమయ్యే కార్యం కాదు. ఏదో ఒక ఏజెంటు ద్వారా, తెరవెనుక ఉండి వాడు తన కార్యాలను జరిగింప నిష్టపడతాడు. దేవుని ఉద్దేశాలు నెరవేర్చబడేలా, యేసును ముఖాముఖిగా ఎదుర్కునేలా వాడు బలవంతపెట్టబడినట్టున్నాడు.

శోధనను స్టడీ చేయడంలోని విలువ ఏమంటే – అపవాది బహిర్గతం చేయబడ్డాడు. వాడు బయటికి లేక వెలుపలికి వచ్చేలా బలవంతపెట్టబడ్డాడు. వాని పద్ధతులు, గమ్యాలు దాపరికం లేకుండ ప్రదర్శించబడ్డాయి. ప్రభువైన యేసు ఎదుర్కొన్న మూడు శోధనలను

మనం చదివేటప్పుడు, సాతాను కుయుక్తిని ప్రత్యేకమైన శ్రద్ధతో గమనించు. వేలసంవత్సరాలుగా వాడు జనులను మోసగిస్తున్నాడు. ఈ వేల సంవత్సరాలలో గడించిన అనుభవాన్ని వాడు క్రీస్తుపై ప్రయోగించాడు.

## మొదటి శోధన (4:1-4)

క్రీస్తు ప్రభువు యెదుట అపవాది ఉంచిన తొలి శోధన, భౌతిక సంబంధమైన పరీక్ష:

### అపవాది (1-3 వచ.)

> ... అప్పుడు యేసు అపవాదిచేత శోధింపబడుటకు ఆత్మవలన అరణ్యమునకు[4] కొనిపోబడెను. నలువది దినములు నలువది రాత్రులు[5] ఉపవాసముండిన పిమ్మట ఆయన ఆకలిగొనగా, శోధకుడు ఆయన యొద్దకు వచ్చి ... (1-3ఎ వచనాలు).

దేవునియందు క్రీస్తుకు గల విశ్వాసాన్ని పరీక్షించడమే మొదటి శోధనలోని అపవాది ఉద్దేశం. వాడు ప్రభువును యిలా సవ్వాలు చేశాడు: "నీవు దేవుని కుమారుడవైతే, ఈ రాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుము" (3 వ.) నలభై దినాలకు ముందు, పరలోకమునుండి ఒకరి శబ్దము, "ఈయనే నా ప్రియ కుమారుడు, ఈయనయందు నేనానందించు చున్నాను" అని పలికింది (మత్తయి 3:17). ఇప్పుడైతే, అపవాది యిలా అంటున్నాడు: ఆ శబ్దం పలికింది నిజమైతే – నీవు నిజంగా దేవుని కుమారుడవే అయితే, నీవు ఆకలిగొననేల? ప్రత్యేకానుకూలత లేని ఆ అంతస్థు ఎందుకు? అనేది వాని భావం. అరణ్యపు రాళ్లను రొట్టెలుగా మార్చడంలో యేసు ఉద్దేశాలను నెరవేర్చవచ్చునంటూ అపవాది చూచించాడు: న్యాయబద్ధమైన తన అవసరత (ఆకలిని)ను తీర్చుకోవచ్చు, అదే సమయంలో తన కుమారత్వాన్ని నిరూపించుకోవచ్చు.

నేను క్రీస్తు స్థానంలో ఉండి ఉన్నట్టయితే, నా ప్రత్యుత్తరం ఎలాగుండేదంటే – "అపవాదీ, నేను నీకు చూపుతాను" అని రాళ్లను వెంటనే మార్చివేసేవాడనే. నేను ఆ సవ్వాలు నుండి వెనుకకు వెళ్లేవాడను కాను. నీవు కూడా అలాగే ఉండి ఉండవచ్చు.

### క్రీస్తు (4 వ.)

క్రీస్తు సాతాను పన్నాంగాన్నంతా చూచాడు.[6] అయితే ఆయన బదులిస్తూ, "అని వ్రాయబడియున్నది" అని అన్నాడు. (4 వ.) సాతాను శోధనకు వ్యతిరేకంగా ప్రభువు ఆయుధము దేవుని వాక్యం. "నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యమును ఉంచుకొని యున్నాను" అని కీర్తన రచయిత అన్నాడు (కీర్తన. 119:11). శోధనకు లోబడకుండ ఉండే శ్రేష్ఠమైన భద్రతల్లో ఒకటి నీ హృదయమును వాక్యముతో నింపుకొనుటయే!

ఈ శోధనను ఎదుర్కొనడానికి సరియైన లేఖన భాగం ద్వితీయో. 8:3నుండి వచ్చింది. ప్రభువైన యేసు, "మనుష్యుడు రొట్టెవలన మాత్రమేగాక, దేవుని నోటనుండి వచ్చు ప్రతిమాటవలన జీవించును" అని కోట్ చేశాడు (4బి వ.). మొదటిగా, "మనుష్యుడు" అనే మాటను గుర్తించుకో: "మనుష్యుడు రొట్టెవలన మాత్రమే జీవింపడు ..." అరణ్యములో నలభైదినాలు యేసు ఉండడంలో ప్రాథమికంగా ఆయన దేవత్వానికి కాదు ఆయన మానవత్వానికే పరీక్ష. ఆయన దేవుడైయున్నాడని నిరూపించడం తన ఉద్దేశం కాదు. బయలుపరచబడిన దేవుని చిత్తం మేరకు ఆయన పరిపూర్ణమైన నరుడని ప్రదర్శించడమే ఆయన ఉద్దేశం.

తరువాత "రొట్టె" అనేదానికిని, "దేవుని నోటనుండి వచ్చు ప్రతిమాట" అనే దానికిని మధ్య తారతమ్యాన్ని గమనించు. యేసు అటు రొట్టెలో లేక యిటు దేవుని చిత్తమో కోరుకోవలసియుంది. ఆయన ఆకలిగొని ఉండవలసింది – దేవుని వాక్యమునకే – గనుక ఆయన తప్పక దేవుని చిత్తము యొక్క పరిధిలోనే ఉండాలి.

యేసు మొదటి శోధనను ఎదుర్కొన్నాడు.

## రెండవ శోధన (4:5-7).

రెండవ శోధన ఆత్మ సంబంధమైన పరీక్ష.

**సాతాను (5, 6 వచ.)**

సాతాను అంత తేలిగ్గా విడిచిపెట్టడు. తన తదుపరి శోధనకొరకు, వాడు బహు జాగ్రత్తగా ఒక స్థలాన్ని ఏర్పరచుకొన్నాడు. వాడు క్రీస్తును "పరిశుద్ధ పట్టణమైన" యెరూషలేమునకు కొనిపోయాడు (5ఎ వ.). ఆ స్థలం యూదులకు, మరియు క్రీస్తుకును ప్రశస్తమైనదై ఉంది (కీర్తన. 48:2; 137:5; మత్తయి 23:37). అప్పుడు వాడాయనను, ఆ పట్టణంలో బహుగా గౌరవించబడే స్థలమైన దేవాలయమునకు తోడుకొనిపోయాడు. చివరిగా, దేవాలయ శిఖరానికి తీసికొని పోయాడు. "దేవాలయ శిఖరమున ఆయనను నిలువబెట్టి" అని లేఖనం చెప్తుంది. (5బి వ.). శిఖరం అంటే, శిల్పకళాస్తంభములాటిది ఏదీ లేకపోయినా, దేవాలయంలోని ఎత్తయిన చోటును చూపుతుంది. అది దక్షిణ భాగంలో ఉండవచ్చు. ఇక్కడ నుండి దేవాలయ సంబంధమైన భాగాలన్నిటిని, దూరంగా విస్తరించి యున్న పట్టణమంతటిని తిలకించవచ్చు.

ఎత్తయిన ఆ స్థలంలో క్రీస్తు ప్రభువుతోపాటు నిలిచి, అపవాది ఆయనతో యిలా అన్నాడు: "నీవు దేవుని కుమారుడవైతే క్రిందికి దుముకుము – ఆయన నిన్ను గూర్చి తన దూతల కాజ్ఞాపించును, నీ పాదమెప్పుడైనను రాతికి తగులకుండ వారు నిన్ను చేతులతో ఎత్తికొందురు అని వ్రాయబడియున్నది" (6బి వ.).

దేవునిపై క్రీస్తు ఎంత నమ్మిక కలిగియున్నాడో అపవాది పరీక్షిస్తున్నాడు. మరోవిధంగా చెప్పాలంటే, "నీవు దేవుని యందు విశ్వాసముంచుచున్నావు కావా? నీవు దేవునియందు ఎంతగా నమ్మిక యుంచావో చూద్దాం. ఈ శిఖరమునుండి నిన్ను నీవు పడద్రోసికొనేవరకు

ఆయన యందు నమ్మిక కలిగియున్నావా?" అని వాడు ఆయనతో అన్నాడు. నీవు "లేఖనాన్ని కోట్" చేస్తున్నావు. "నేను కూడా లేఖనాన్ని కోట్ చేయగలను. ఆలకించు ..." వాడు కీర్తన 91:11, 12ను కోట్ చేశాడు. దేవునియందు పరిపూర్ణమైన నమ్మికను తెలిపే కీర్తనయే 91వ కీర్తన. మొదటి వచనం యిలా అంటుంది: "మహోన్నతుని చాటున నివసించేవాడే సర్వశక్తుని నీడను విశ్రమించువాడు."

అది ఎంతటి యుక్తితో కూడిన శోధనయైయుంది! అసాధారణమైన దానిని ప్రయత్నించడంవలన – విరోచితమైనది, సాహసముతో కూడినది లేక అపాయకరమైన దానిని జరిగించడంలో నమ్మిక అత్యాధికమైన పరిపూర్ణతగా వ్యక్తపరచబడుతుందని అది తెలుపుతుంది.

**క్రీస్తు (7 వ.)**

అపవాది "ఆత్మ ఖడ్గం" (ఎఫెసీ. 6:17) ఉపయోగించ ప్రయత్నించాడు, అయితే అంతకంటే నైపుణ్యంగా ఉపయోగింపగలవాడుగా ప్రభువు తన్ను రుజువు చేసికొన్నాడు. "మరియొక చోట యిలా వ్రాయబడియున్నదని" యేసు తెలిపాడు (7ఎ వ.) అంటే, "సాతానా, నీవు ఒక లేఖన భాగాన్ని కోట్ చేశావు, కాని ఏ ఒక వచనము కూడా ఒక అంశం మీద ఉన్న విషయాన్ని అయిపోయేలా చేయదు. ఒక అంశముపై బైబిలు చెప్పిన దాని నంతటిని తీసికోవాలి." లేఖనాలను, ఒంటరిగా తీసి అదే అంశాన్ని గూర్చి యితర లేఖన భాగాలను పరిశీలించకపోవడం వలన ఎక్కువ దోషము జరుగుతుంది.[7]

అప్పుడు యేసు ద్వితీయో. 6:16నుండి – "ప్రభువైన నీ దేవుని శోధింపవలదు" అని మరియొక చోట వ్రాయబడియున్నదని వానితో చెప్పెను (7 వ.). క్రీస్తు జవాబును అపార్థము చేసికొనవద్దు. దేవుడని ఆయన తన్ను తాను సూచించు కోలేదు. అందువలన, "నన్ను పరీక్షించడం తప్పని" ఆయన తనను గూర్చి చెప్పుకొనలేదు. (పరిపూర్ణమైన తన మానవత్వంలోనేగాని, తన దేవత్వంలో ఆయన ఈ శోధనలను ఎదుర్కొనలేదని మనస్సులో ఉంచుకో). కాని, దేవుని పరీక్షించుట తప్పని ఆయన వానితో చెప్పెను.

దేవాలయ శిఖరం నుండి క్రిందికి దుముకుట దేవుని యందు నమ్మికయుంచుటను సూచిస్తుందని సాతాను అంటాడు; అది దేవుని శోధించినట్టు ఔతుందని క్రీస్తు అంటాడు. వాస్తవానికి, ఆయన దేవునియందు నమ్మికయుంచలేదని అది సూచిస్తుంది. ఒక వ్యక్తి యందు మనకు సంపూర్ణ విశ్వాసమున్నట్టయితే, ఆతనిని లేక ఆమెను పరీక్షించవలసిన అవసరమే ఉండదు. ఒకరియందు మన విశ్వాసం చలించుతున్నప్పుడు మాత్రమే పరీక్షించడం అవసరమన్న విషయం మనస్సుకు వస్తుంది.

జీవితంలో ఏది ఎదురైనా, ఆయన మనకు సహాయపడతాడని ఆయనపై మనం ఆధారపడియుండడంలో దేవుని యందలి మన విశ్వాసం వ్యక్తపరచబడుతుంది. ఆయన కొరకు మనము పెట్టే కృత్రిమ పరీక్షలవలన అది వ్యక్తపరచబడదు.[8]

మరోసారి, ఒకే సూత్రంవలన నడిపింపబడే నరుడని యేసు తన్నుతాను ప్రదర్శించుకున్నాడు: దేవుని చిత్తం జరిగించడానికి తీర్మానించుకున్నవానిగా నిలిచి యున్నాడు. ఆయన రెండవ శోధనను ఎదుర్కొన్నాడు.

## మూడవ శోధన (4:8-10)

మూడవ శోధన బహు కీలకమయ్యింది. అది క్రీస్తు పనికి – లేక, వెల ఎంతయైనా తన కర్తవ్వాన్ని తుదమట్టుకు కొనసాగించడానికి పరీక్షయై ఉంది. సేవకుని లయపరచడంలో విఫలుడైన సాతాను, ఆయన సేవను లయపరచ ప్రయత్నించాడు.

**సాతాను (8, 9 వచ.)**

ఈ శోధన చాలా ధైర్యంతోనూ సాహసంతోనూ కూడి ఉంది. మొదటి రెండు శోధనలలో, అపవాది మోసయుక్తమైన వంచనలనుండి వానిని వస్త్రహీనునిగా చేశాడు, వాని మోసపు ఉద్దేశాలను బయలుపరచాడు. మూడవ శోధనలలో, సాతాను మారువేషాలన్నీ తీసివేసి, రెండవ రకమైన పద్ధతులను కట్టిపెట్టాడు. ఉద్దేశ పూర్వకంగాను, నేరుగాను, ఎదిరించినట్టుగాను – క్రీస్తు తన్ను పూజించాలని వాడు ఆయనను అడిగాడు.

"మరల అపవాది మిగుల ఎత్తయిన ఒక కొండమీదికి[9] ఆయనను తోడుకొని పోయి, యీ లోక రాజ్యములన్నిటిని, వాటి మహిమను ఆయనకు చూపి" (8 వ.) లోక రాజ్యములన్నిటి వైభవాన్ని గూర్చి ఒక్కేసారి ఆలోచించు – సామ్రాజ్యాలన్నీ: మహాగొప్ప రోమా సామ్రాజ్యం, గ్రీసు, పార్స్య, బబులోను, అష్షూరు, ఐగుప్తు, దావీదు, సొలొమోను రాజ్యము – బితునియ, సిరియా రాజ్యాలు మరియు యింకా యితర ప్రాంతాల రాజ్యాలన్నీ! వీటన్నిటిని క్రీస్తు కన్నుల యెదుట ఒకసారి మెదిలించాడు!

అప్పుడు సాతాను యిలా అన్నాడు, "– నీవు సాగిలపడి నాకు నమస్కారము చేసిన యెడల వీటన్నిటిని నీకిచ్చెదను" (9 వ.). ఇదంతా యివ్వచూపినవాడు సాతాను. క్రీస్తు ప్రభువు దాన్ని కాదన లేదు (లూకా 4:6). ఇవ్వజూపించినది నిజమైనది కానట్టయితే,[10] అక్కడ శోధనయే లేదు. నేటివలెనే, ప్రభువు యొక్క భూనివాస కాలంలో, లోకరాజ్యాలమీద అపవాది తన అధికారాన్ని కలిగియున్నాడు. వాని కోర్కెలకు అవి లోనైయున్నాయి; అవి వాని ఆజ్ఞలకు లోబడియున్నాయి; వాని యిష్టం చేత అవి చెరపట్టబడ్డాయి. "ఈ లోకాధికారి"యని ప్రభువు వానిని తరువాత పిలిచాడు (యోహాను 12:31).[11]

ఈ శోధన ప్రభువుయొక్క పనికి పరీక్షయని ముందుగానే అన్నాను. దీనినంతటిని ఏ శ్రమయు లేకుండ క్రీస్తు పొందవచ్చునని సాతాను సలహాయిస్తున్నాడు.[12] దైవికమైన గమ్యానికి అడ్డుదారిని వాడు చూపుతున్నాడు. మరణించడం కంటె మోకాళ్లు వంచడం ఎంత తేలికైయుండేదో!

తన కుయుక్తి అంతటితో సాతాను గ్రహింప గలిగిన దానికంటెను అది ప్రభువైన యేసుకు ఎంతటి తీవ్రమైన భావాన్ని కలిగించిందో. క్రీస్తు కొరకు ఏది వేచియుందో గ్రహించనప్పుడు, గెత్సేమనే తోటలో ఆయనను చిత్రించుకో. ఆయన తన తండ్రికి తన హృదయాన్ని కుమ్మరించినప్పుడు, చెమట తన దేహం నుండి ఏరులై పారినట్టుంది: "తండ్రీ, నీ చిత్తమైతే ఈ గిన్నె నా యొద్దనుండి తొలిగించుము ..." (మత్తయి 26:39). సిలువపై ఆయనను వీక్షించుము, "నా దేవా, నా దేవా, నీవు నన్నేల విడనాడితివి?" అని విలపిస్తున్నాడు (27:46). ఇది నిజమైన శోధన అనడానికి ఏ సందేహమూ లేదు.

దాటిపోతూ, సాతాను క్రీస్తును ఎలా అంచనావేసాడో చూడు. తాను సంపాధించిన రాజ్యములన్నిటికంటె క్రీస్తు ఎక్కువ విలువైనవాడని వాడాలోచించాడు. క్రీస్తు మరణం సమస్త మానవాళికి సరిపోతుందన్న సంగతి కొందరు నమ్మరు, కాని ఆయన నిజమైన విలువను అపవాది అర్థం చేసికొన్నాడు.

**క్రీస్తు (10 వ.)**

అపవాదికి ప్రత్యుత్తర మిస్తూ, క్రీస్తు తన సొంత అధికారపు భాషలో మాట్లాడాడు. గత దాడులలో సాధించిన విజయాలవలన ఈ అధికారం ఏర్పాటయ్యింది.

శోధకునికి క్రీస్తు "సాతానా, పోమ్ము" అంటూ ప్రభువు తీక్షణమైన ఆజ్ఞ నిచ్చాడు (10ఎ వ.). అప్పుడు క్రీస్తు ఆత్మ ఖడ్గాన్ని చేబూని, ద్వితీయో. 6:13 కోట్ చేస్తున్నాడు: "ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను అని వ్రాయబడి యున్నది." (10 వ.) ఈ శోధన యొక్క కుయుక్తి స్వభావాన్ని క్రీస్తు ప్రభువు మాటలు వెలుగులోనికి తెచ్చాయి. ఇంతకు అపవాది ఏమని చెప్పాడంటే, "నీవు నాకు మ్రొక్కు, నేను నిన్ను ఈ లోకరాజ్యాలన్నిటికిని యజమానునిగా చేస్తాను." సేవించుట, ఆరాధించుట అనే రెండింటిని విడదీయలేరని క్రీస్తు సూచించాడు. సాతానుకు దాసుడు కాకుండ వానిని పూజింపలేమనుకున్నాడు. లోకరాజ్యాలకు సాతాను క్రీస్తును కీలుబొమ్మ అధికారిగా చేసియుండవచ్చు, కాని వాస్తవానికి, దానివలన ప్రభువు పొందగలిగేది ఏదీ ఉండదు. సాతాను యొక్క ఆధీనంలోనే ఆయన ఉండవలసియుంటుంది.

మరల, తన తండ్రి చిత్తములో క్రీస్తు స్థిరముగా నిలిచియున్నాడు. తన రాజ్యాన్ని స్థాపించుకొనడానికి ఆయన సిలువకు వెళ్ల సిద్ధంగా ఉన్నాడు.

సాతాను యిచ్చే దానంతటికంటెను దేవుని బహుమానాలు ఎంతో అనంతంగా శ్రేష్ఠమైనవైయున్నాయి. వాని బహుమానాలు మంచివిగా ఉన్నట్టు అపవాది చూపించ వచ్చు – లోకరాజ్యాలను ఆయన ఎదుట ఉంచిన వాటివలె ఆకర్షణీయంగా శరీరానికి కన్పించవచ్చు. ఈ శోధన విషయంలో లూకా యింకా వివరాలను యిస్తుంది. "ఒక నిమిషములో" ఈ లోకరాజ్యాలను అపవాది క్రీస్తునకు చూపినట్టుంది (లూకా 4:5). అంతకంటె ఎక్కువ సేపు చూపించి యుండినట్టయితే వాటి విలువ అంత ఎక్కువగా లేకపోయేది. ఆ మహిమ తళ తళ మెరిసే రేకువంటిదేగాని[13] అది బంగారము వంటి మహిమ కాదు. యోహాను చెప్పినట్టు – "ఈ లోకమును దాని మహిమయు గతించిపోవును" (1 యోహాను 2:17ఎ).

## ముగింపు (4:11)

ప్రభువైన యేసు యొక్క గద్దింపును, జవాబును, పురస్కరించుకొని అపవాది మౌనం వహించాడు. ఓటమిని అంగీకరించినదానికి రుజువుగా అతడీ పని చేశాడు. 11వ వచనం యిలా అంటుంది: "అంతట అపవాది ఆయనను విడిచిపోగా ..." చాల సంవత్సరాల క్రిందట, T. B. లారిమోర్ శోధనలపై ప్రసంగించాడు. అతని వివరణ

ఎంత తేటగా ఉందంటే – “అపవాది ఆయనను విడిచిపోగా” అని అతడనేటప్పటికి, శ్రోతలు ఏకంగా నిట్టూర్పు విడిచారు.

“అపవాది ప్రతిశోధనను ముగించి, అనుకూల సహాయం వచ్చేవరకు కొంతకాలము ఆయనను విడిచిపోయెను” (లూకా 4:13) అని లూకా అన్నాడు. మన స్టడీ కొనసాగే కొలది, సాతాను ప్రభువును ఎలా శోధించుటలో కొనసాగాడో చూద్దాం: జన సమూహాలు ఆయనను భూసంబంధమైన రాజుగా చేయబూనారు (యోహాను 6:15); ప్రజలు ఒక సూచన చూపుమని ఆయనను మాటిమాటికి అడిగేవారు (లూకా 11:29); ఆయన శిష్యులలో ఒకడు ఆయన సిలువకు పోకూడదని నిరాశపరచాడు (లూకా 16:21–23). అయినప్పటికి, ఇది మొదలుకొని, యేసు అపవాదిని వాని అనుచరులను యజమానుడు దాసులతో మాట్లాడినట్టు మాట్లాడేవాడు. ఆయన వానిపై విజయం సాధించాడు.

తన పరిచర్యకు సిద్ధపడినవాడై యేసు అరణ్యమునుండి వచ్చెను. “అప్పుడు యేసు, ఆత్మ బలముతో గలిలయకు తిరిగివెళ్లెను” అని లూకా తెలుపుతున్నాడు (లూకా 4:14ఎ). సిలువ మరణానికి సిద్ధపడినవాడై, తన శోధననుండి తిరిగి వచ్చాడు. ఆయన పాపములేని దేవుని కుమారుడుగాను, “నిర్దోషమును నిష్కళంకమునైన” గొఱ్ఱెపిల్లగా మిగిలిపోయాడు (1 పేతురు 1:19).

శోధన గాథలో మనకు అనేక అభ్యాస సంబంధమైన పాఠాలున్నాయి. శోధనకు సిద్ధపడాలంటే, దేవుని వాక్యాన్ని మనం నేర్చుకొనియుండాలి, కంఠత చేయాలి కూడా. అది యాకోబు 4:7బి లోని సత్యాన్ని సయితం ప్రదర్శిస్తుంది: “అపవాదిని ఎదురించుడి, అప్పుడు వాడు మీ యొద్దనుండి పారిపోవును.” మహా ప్రశస్తమైన పాఠాలలో ఒకటేమంటే, మనం శోధనలో ప్రవేశించినప్పుడు, ప్రభువు మనలను అర్థం చేసికొని తాలిమి చూపగలవాడై యున్నాడు. హెబ్రీయులకు రతయిత యిలా అన్నాడు:

> మన ప్రధానయాజకుడు మన బలహీనతలలో మనతో సహానుభవము లేనివాడు కాదు గాని, సమస్త విషయములలో మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము (హెబ్రీ. 4:15, 16).

దేవుని సహాయముతో మనము కూడా సాతానుపై విజయము సాధించగలము![14]

---

సూచనలు


[1]ఈ ప్రసంగంలోని ఎక్కువ భాగం G. Campbell Morgan, *The Crises of the Christ* (New York: Fleming H. Revell Co., 1936), 162–99 నుండి వచ్చింది. [2]శోధన అనేదానికి ఎక్కువ వివరాలను ఈ సంచికలో “సమీపించి యున్నది” అనే పాఠం చూడు. [3]ప్రభువైన యేసుతో ఉన్న సహవాసులు అడవి జంతువులని మార్కు 1:13 చెప్పుతుంది. [4]ఈ అరణ్యం ఎక్కడిదో మనకు చెప్ప లేదు. ఇది యూదయ అరణ్యమై యుండవచ్చు. అక్కడ సిద్ధపడి, తన పనిలో ఎక్కువ భాగం అక్కడే చేశాడు (మత్తయి 3:1, 3; 11:7; లూకా 1:80; 3:1–2). పటమును చూడు. [5]నీళ్లు


త్రాగుతూ ఉంటే, నలభై దినాలు భోజనం లేకుండ ఉండవచ్చునని నవ యుగంలో ప్రదర్శింపబడింది. [6]ప్రతి శోధనను పరిశీలించి చూడడంవలన శోధనలను పఠించుటలో మేలుంది: అది ఎందుకు తప్పు, క్రీస్తు వాటిని ఎలా ఎదుర్కొన్నాడు. సాతానువలన ఆ సలహాలు యివ్వబడ్డాయి గనుక అవి తప్పయి ఉండాలని కొందరు భావించారు. విషాదకరంగా, "వెలుగు దూత"వలె అపవాది వస్తాడు ( 2 కొరింథీ. 11:4). ప్రత్యేకమైన శోధన ఎందుకు తప్పో మనం గ్రహించలేక పోయినట్టయితే వాడు మనలను సులభంగా మోసగిస్తాడు. [7]దేవుని వాక్యాన్ని యిలా దుర్వినియోగం చేసే ఉదాహరణల నివ్వగోరవచ్చు. [8]"నీ దేవుడైన ప్రభువుకు అవివేకమైన పరీక్షపెట్టవద్దని" కూడా లివింగ్ బైబిలు అంటుంది. [9]ఈ శోధనకు పారంపర్యమైన స్థలము టాబోరు పర్వతం. అయితే అది ఏ పర్వతము అనేది లేఖనం చెప్పడం లేదు. (పటాన్ని చూడు.) [10]ఈ శోధనలో అబద్ధముందని కొందరు నమ్ముతారు: "తాను ఏమి యివ్వలేడో, దానిని సాతాను వాగ్దానం చేశాడు." అలాటి శోధన నీతో, నాతో పనిచేయవచ్చుగాని, క్రీస్తుతో అది తప్పక పనిచేయదు. ఎందుకంటే, లోకాత్మను గూర్చి బహు సన్నిహితమైన జ్ఞానం ఆయనకు ఉంది.

[11]ఈలాటి భావనే, పౌలు 2 కొరింథీ. 4:4లో వ్యక్తపరచాడు. అంతిమ అధికారం, శక్తి, దేవునికే చెందుతుంది. సమస్తం ఆయన వశం. సాతానుకుగల ఏ శక్తియైనా ఉంటే అది దేవుడు ప్రసాదించినదే. అపవాది కార్యకలాపాలకు దేవుడు హద్దులు నియమిస్తాడు. దేవుడు సాతాను కార్యకలాపాలను హద్దుల్లో ఉంచుతాడు. (యోబు గ్రంథంలోని రెండు అధ్యాయాలను చదువు.) [12]యేసు మరణించకయుండినట్టయితే, నీకు నాకు రక్షణ ఉండేదికాదని మనకు తెలుసు. (హెబ్రీ. 9:22; ఎఫెసీ. 1:7). ఇతరుల విషయం ప్రక్కనేపెట్టి, తన్నుగూర్చి తాను అలోచించుకోమని అపవాది చెప్పాడు. క్రీస్తు రాజుగా జన్మించాడు. అపవాది ఆయనకు కిరీటాన్ని మానవాళి లోబడడాన్ని హామిగా యిచ్చాడు. [13]Tinsel అంటే తగరంలాంటిది. ఆ సంఘటన అయిపోయిన తరువాత, ఆ తగరం పడవేయబడింది. [14]దీనిని ప్రసంగంలో ఉపయోగించేటప్పుడు, దేవుని సహాయమును కోరేవాడు దేవునితో సరియైన సంబంధబాంధవ్యం ఉంచుకోవాలి. మొదట విశ్వాసం, విధేయతలద్వారా మొదట దేవుని కుమారుడు కావాలి (మార్కు 16:16; అపొ. 2:28). ఆయనతో సరియైన సహవాసంలో నిలిచియుండాలి. "అపవాదిని పారద్రోలేకి" ముందుగా ఒకడు "దేవునికి లోబడి యుండుడి" అని యాకోబు 4:7లో చెప్పబడింది.


# యేసు శోధింపబడుట

**మత్తయి 4:1-11**






“నీవు దేవుని కుమారుడవైతే, ఈ రాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుమనెను” (3 వ.).




“మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోటనుండి వచ్చు ప్రతిమాటవలన జీవించునని వ్రాయబడియున్నది” (4 వ.).





‘‘నీవు దేవుని కుమారుడవైతే క్రిందికి దుముకుము…అని వ్రాయబడియున్నది” (6 వ.).

**నమ్మిక** | **ప్రతిగా** | **శోధన**

“ప్రభువైన నీ దేవుని నీవు శోధింపవలదని మరియొక చోట వ్రాయబడియున్నది” (7 వ.).




“నీవు సాగిలపడి నాకు నమస్కారము చేసినయెడల వీటన్నిటిని నీ కిచ్చెదను” (9 వ.).




“సాతానా, పొమ్ము ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను అని వ్రాయబడి యున్నది” (10 వ.).

